క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బ్యాంక్ కాలనీ, జీఎస్ఐ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ లింగోజిగూడ, ఇందు అరణ్య ఫీడర్ల కింద మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సదర్ ఉత్సవం

కందుకూరు: మండల కేంద్రంలో సదర్ ఉత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నామని యాదవ సంఘం మండల అధ్యక్షుడు పి.పర్వతాలు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు వేడుకలు జరపనున్నామని, యాదవులు భారీగా తరలిరావాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మేయర్ తదితరులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 21వ డివిజన్‌లో శుక్రవారం సీసీరోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ అనిత, దర్శన్‌రెడ్డి, విజయ్, సుభాన్‌యాదవ్, కుమార్, చారి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

పహాడీషరీఫ్: సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆదిల్ల మహేశ్ డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వ అంగీకారంతో పాటు, కోర్టు కూడా అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. తెలంగాణలో వర్గీకరణ జరగక ముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తుండడంతో మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్పందించి, వెంటనే వర్గీకరణ అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మధుమేహంతో జాగ్రత్త



ర్యాలీ నిర్వహించిన వైద్యబృందం, సిబ్బంది

కందుకూరు: ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముచ్చింతల్ జిమ్స్ హోమియోపతి మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల పరిధి నేదునూరులో వైద్య బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులు, ఇతరులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధి గుర్తించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డయాబెటిస్ ఉన్న వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, వ్యాధిని అదుపులో ఉంచుకోవడానికి ఏం చేయాలో వివరించారు. వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ర్యాలీ, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రజ, విరాజిత, పంచాయతీ కార్యదర్శి రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

తలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణ అని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడు ఆరోగ్య సమస్యంలో నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారాలతో సీఎంఆర్ఎఫ్ కింద బాలుడికి రూ.32 వేల చెక్కు మంజూరయింది. శుక్రవారం చంద్రశేఖర్ రెడ్డి, గ్రామంలో బాధితుడి తండ్రి రమేష్‌కు చెక్కు అందజేశారు. రాజు, నర్సింహ, గురువయ్య, తిరుపతయ్య, అశోక్, కుమార్, గోపాల్, పాండు, జీవ, వెంకటేశ్, జీవ పాండు పాల్గొన్నారు.

చిన్న నీటి వనరులపై చిన్నచూపు!

- వాగుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం
- కనుమరుగవుతున్న నాలాలు, కాల్వలు
- పట్టించుకోని అధికారులు



పులిందర్ వాగులో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

తుక్కుగూడ: చిన్న నీటి వనరుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వాగులు, కుంటలు, తూముల్లో చెత్తాచెదారం పేరకుపోయినా, గుర్రపుడెక్క కమ్మేసినా, నాలాలు, కాల్వలు కనుమరుగయినా ఇరిగేషన్ అధికారులు వాటి పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడు వరద నేరుగా చెరువుల్లోకి చేరడం లేదు. వాగులు వంకల్లో వరద నీరు సాఫీగా ముందుకు సాగడం లేదు. ఇదీ తుక్కుగూడ, మంఖాల్, రావిర్యాల వాగులు వంకల దుస్థితి.

వాగును కప్పేసిన గుర్రపుడెక్క

జిల్లాలోనే అతి పెద్ద చెరువు రావిర్యాల చెరువు. ఈ చెరువుకు భాగ్ మంఖాల్ చెరువు నుంచి వరద నీరు మంఖాల్, తుక్కుగూడ, సర్దార్‌నగర్ రెవిన్యూ పరిధి మీదుగా పులిందర్ వాగు ద్వారా నీరు వచ్చి చేరుతోంది. పులిందర్ వాగు చెత్తాచెదారం, గుర్రపుడెక్కతో నిండిపోయింది. వరద వచ్చే మార్గాలు మూసుకుపోయి, కొత్తగా నీరు చేరడం లేదు. నాలుగేళ్లుగా వరుసగా వర్షాలు కురిసి, వరద ప్రవహిస్తున్నా.. నీరు రాని దుస్థితి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చిన్ననీటి వనరుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుని, వాగుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపచేసి, కాల్వలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల ఆదేశాల మేరకు..

చిన్న నీటి వనరుల అభివృద్ధి, మరమ్మతుల బాధ్యత ఇరిగేషన్ శాఖదే. కానీ వాగు, కాల్వల మరమ్మతు గురించి శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. సమస్య ఉన్న చోట వారి ఆదేశాల మేరకు పని చేస్తాం.

– గోవింద్, ఇరిగేషన్ ఏఈ, మహేశ్వరం

జల్‌పల్లి అభివృద్ధికి కృషి

- మున్సిపాలిటీని గ్రేటర్‌లో విలీనం చేయనున్న ప్రభుత్వం!
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



సరుకులు పంపిణీ చేస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. జీహెచ్ఎంసీలో పురపాలికను విలీనం చేసి, అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం జల్‌పల్లి కమాన్ వద్ద పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ చైర్మన్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో, కేఎల్లార్ పేదలకు ఉచితంగా నిత్యవసరా సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పురపాలికలో చాలా మంది పేదలే ఉన్నారని, ఇలాంటి వారి కోసం సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారని, ప్రతి ఒక్కరు చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ యాదగిరి, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, రవికుమార్, నవీన్ కుమార్, ఎక్బాల్ బిన్ ఖలీఫా, భూపాల్ రెడ్డి, అహ్మద్ బామ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేపై కమిషనర్ ఆరా



పహాడీషరీఫ్: సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సర్వే తీరును శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్ల నుంచి స్థానికుల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వం తలపెట్టిన ఈ సర్వేకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని అన్నారు. 21వ వార్డు పరిధిలో మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్ స్థానికులకు సర్వేపై అవగాహన కల్పించి సహకరించాలని సూచించారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన కొనసాగుతుంది. శుక్రవారం మూడోరోజు ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన గృహాలకు స్టికర్లను అంటించారు. ఈ సర్వేను కమిషనర్ వాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేష్, మల్లేష్, జంగయ్య, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా అభివృద్ధి శూన్యం

- సీపీఐ మండల కార్యదర్శి కె శ్రీనివాస్
- రోడ్ల పరిస్థితి అధ్వానం
- పట్టించుకోని అధికారులు



కనకమామిడి రోడ్డు గుంతలను చూపిస్తున్న శ్రీనివాస్ తదితరులు

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకమామిడి, కంచమోనీగూడ, తోల్‌కట్ట, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి గ్రామాల రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కనకమామిడి నుంచి కంచమోనీగూడ, చాకలిగూడ, వెంకటాపూర్ గ్రామాల రోడ్డు ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సజ్జన్‌పల్లి, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని పేర్కొన్నారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, కె.రత్నం, బోనాల ప్రభాకర్, వెంకటయ్య, నర్సింహులుగౌడ్, విఠలయ్య, రాములు, రవీందర్‌రెడ్డి, సుగుణాకర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌మిషన్ ఏర్పాటు చేయొద్దని వినతి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం శివారులో క్రషర్ మిషన్ ఏర్పాటు చేయొద్దని పరిసర పొలాల రైతులు శుక్రవారం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇక్కడ క్రషర్ ఏర్పాటుచేస్తే పంట పొలాలు దెబ్బతింటాయని, వ్యవసాయ బోర్లు దెబ్బతింటాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులు విచారించి క్రషర్ ఏర్పాటును నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యాదగిరి, యూసూప్, గౌస్, యాదగిరి గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాలతి

- చేవెళ్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్ రూరల్: మేడ్చల్ జిల్లాలో నిర్వహించిన చెస్‌లో చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి పేర్కొన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు సంధ్య, వెన్నెల, ప్రణీత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బోడుప్పల్‌లో నిర్వహించిన అండర్-14, 17 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

- చేవెళ్లలో 16,905 కుటుంబాల గుర్తింపు
- మూడోరోజు పూర్తయిన స్టిక్కరింగ్
- నేటి నుంచి సర్వే వివరాల సేకరణ
- ఎంపీడీఓ హిమబిందు



స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మూడురోజుల పాటు నిర్వహించిన కుటుంబాల గుర్తింపు ముగిసిందని, శనివారం నుంచి కుటుంబ వివరాల సేకరణ నిర్వహిస్తారని చేవెళ్ల ఎంపీడీఓ బి హిమబిందు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలో శుక్రవారం మూడోరోజు స్టిక్కర్లు అతికించారు. ఆలూరు గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడారు. ఈ సర్వేను మండల సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేశారని, సాయంత్రం వరకు జరిగిన ఈ సర్వేలో మండలంలో మొత్తం 146 బ్లాక్‌ల పరిధిలో 16,905 కుటుంబాలను గుర్తించినట్లు ఆమె చెప్పారు. ఈ కుటుంబాల గుర్తింపు ఆధారంగా మండలానికి సర్వేఫాంలు ఉన్నతాధికారులు అందించనున్నట్లు తెలిపారు. మండలంలో ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా అన్ని కుటుంబాలను సర్వే నిర్వహించామన్నారు. మండలంలో నేటి నుంచి గ్రామాల్లో కుటుంబ వివరాల సేకరణ సర్వే కొనసాగనుందన్నారు. కుటుంబాల గుర్తింపు వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు. దీని ప్రకారం శనివారం ఉదయం వరకు మండలానికి సర్వే ఫాంలు అందుతాయని వాటిని ఎన్యుమరేటర్లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వేను గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అపోహలకు పోవద్దని సర్వే సిబ్బందికి పూర్తి సమాచారం అందించాలని సూచించారు.



మహేశ్వరం: కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



తుక్కుగూడ: పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న కేఎల్లార్ తదితరులు

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

ప్రజా సంక్షేమం, తెలంగాణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. శుక్రవారం సీఎం పుట్టిన రోజును పురస్కరించుకుని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో కేక్‌కట్ చేసి ఘనంగా సంబురాలు చేసుకున్నారు.
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు కులగణనకు శ్రీకారం చుట్టిన బడుగుల ఆశాకిరణం రేవంత్ అని కొనియాడారు.

–సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ తదితరులు



బడంగ్‌పేటలో..



అమీర్‌పేట్ గ్రామంలో..

ఐఏఎస్ అభ్యర్థులు దేశభక్తితో పనిచేయాలి

- ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

మొయినాబాద్: ఐఏఎస్ అభ్యర్థులు సామాజిక, దేశభక్తి భావనతో పనిచేయాలని 21వ సెంచరి ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, చైర్మన్ పి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించండి అనే అంశంపై యూపీఎస్సీ మాస్టర్ క్లాస్ పేరుతో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో సివిల్ సర్వీస్ సర్వెంట్స్‌కు ప్రత్యేక అధికారాలు ఉన్నాయన్నారు. సివిల్ సర్వీస్‌లో సీటు సాధించడానికి ఏకాగ్రత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, ట్రైనింగ్, ప్లేస్మెంట్ హెడ్ డేనియల్ ప్రభాకర్, జీ5 డైరెక్టర్ గిరి ప్రకాశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి

- మండలి చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం రాజేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం వారసులైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మహేందర్‌రెడ్డి తనయుడు రినీష్‌రెడ్డిలు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి. క్రిష్టారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన బీంభరత్, బీఆర్ఎస్ నియోజకవర్గం దేశమొళ్ల ఆంజనేయులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, వీరందర్‌రెడ్డి, ఆగిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శంకర్, ప్రభాకర్, నర్సింలు, మాధవ్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, నర్సింలు, చందు, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్నం రాజేందర్‌రెడ్డి జయంతి సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియం, పీఆర్ఆర్ కళాశాల, మండల పరిధిలోని ముద్దెంగూడ, గోల్లూరుగూడ గ్రామాల్లోని రాజేందర్‌రెడ్డి విగ్రహాలకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోనే షాబాద్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్నం రాజేందర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసేవాడని గుర్తు చేసుకున్నారు. సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోట్ల మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, జడల రాజేందర్‌గౌడ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.